దివ్యాంగులకు అభయం

- మండలానికో భవిత కేంద్రం
- ప్రతి సోమవారం ఫిజియోథెరపీ సేవలు
- ఉచితంగా పరికరాల పంపిణీ
- నియోజకవర్గంలో 817 మంది దివ్యాంగ చిన్నారులు



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేయిస్తున్న ట్రైనర్

ఆలూరు రూరల్: దివ్యాంగుల భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. మండల కేంద్రాల్లో ప్రత్యేక భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి వారిని వివిధ అంశాల్లో సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతోంది. వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేలా ముందుకు సాగుతోంది. సాధారణ పిల్లలతో కలిసి సాగేలా చర్యలు చేపడుతోంది. గృహ స్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. ప్రతి సోమవారం ఆలూరులోని భవిత కేంద్రంలో మంగళ, బుధ వారాల్లో అలాగే చిప్పగిరి, ఆస్పరి, హలహర్వి, దేవనకొండ, హొళగుంద మండలాల్లో ఫిజియో థెరపీ క్యాంపు నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం భవిత కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న మానసిక దివ్యాంగులకు ఇంటి వద్దకే విద్య అనే కార్యక్రమం ద్వారా వారికి ప్రత్యేక పద్ధతులలో పాఠాలు బోధిస్తున్నారు.

ప్రతి మండలంలో సేవలు

ఆలూరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల పరిధిలో 6 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 817 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 70 మంది భవిత కేంద్రాలకు వస్తున్నారు. 747 మంది విద్యార్థులలో కొంత మంది ఇంటి వద్ద మరికొంత మంది ఇతర పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులకు ఐఈఆర్టీలు (ఇన్‌క్లూజివ్, ఎడ్యూకేషన్, రిసోర్స్ టీచర్) ఆయాలను నియమించారు. ఈ కేంద్రాలకు వారానికి ఒకసారి ఫిజియోథెరపీ ట్రైనర్ వచ్చి వ్యాయామం చేయిస్తారు. దీంతో పాటు ఇంట్లో వ్యాయామం ఎలా చేయించాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం కదల్లేని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు పలు అంశాలు తెలియజేస్తారు.

భవిత కేంద్రాల్లో అందుతున్న సేవలు

- మానసిక వికలాంగులకు రూ.14 వేలు విలువైన ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందిస్తారు.
- ఉచితంగా మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాస్‌లను అందించే అవకాశం కల్పిస్తారు.
- వేల రూపాయలు విలువ చేసే హియరింగ్ మిషన్, చక్రాల కుర్చీలు తదితర వాటిని ఉచితంగా అందిస్తున్నారు.
- అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రధానంగా దినసరి కార్యక్రమాలు (కాల కృత్యాలు) ఏలా చేసుకోవాలో, కృత్యాలు (యాక్టివిటీ)ల ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా చేస్తూ, విద్యార్థులకు చేయిస్తూ శిక్షణ ద్వారా అభివృద్ధి చేయిస్తారు. వీరికి భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణలు భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.
- మానసిక వికలాంగులకు దృశ్య రూపక వస్తువుల ద్వారా (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) విద్యార్థులకు సులువు పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు.
- చెవిటి, మూగ విద్యార్థులకు స్పీచ్ థెరపీలో ఫ్లాష్ కార్డు (అక్షరాల బొమ్మ) లిప్ రీడింగ్ ద్వారా టచ్ ద్వారా అక్షరాలు నేర్పిస్తున్నారు.
- మండలాల వారీగా భవిత కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య
- దివ్యాంగుల్లో వైకల్య శాతం తగ్గి వారు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా తర్ఫీదునిస్తారు.

సాధారణ పిల్లలతో మెలిగేలా శిక్షణ



దివ్యాంగ చిన్నారులు మిగతా పిల్లలతో సమానంగా మెలిగేలా శిక్షణ ఇస్తున్నాం. వారి వైకల్య శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. వారిలో ఉన్న ప్రతిభను వెలితేసేందుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్ద విద్యను అందిస్తున్నాం.

– రామదాసు, ఐఈఆర్టీ, ఆలూరు

మండలం పేరు	భవిత కేంద్రానికి వచ్చే పిల్లలు
ఆలూరు	20
ఆస్పరి	10
చిప్పగిరి	10
దేవనకొండ	10
హాలహర్వి	10
హొళగుంద	10

దివ్యాంగుల పట్ల ప్రత్యేక దృష్టి



దివ్యాంగులకు అందాల్సిన వసతులన్నీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చేలా సేవల వివరాలు తెలియజేస్తున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

– కోమలాదేవి, ఎంఈఓ ఆలూరు

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కృష్ణగిరి జెడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్

కృష్ణగిరి: మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను బుధవారం పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలోని పట్టభద్రులు, టీచర్లకు సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పురుషోత్తంకు సూచించారు. మండలంలో టీచర్లకు సంబంధించి 9 మంది, పట్టభద్రులకు సంబంధించి ఇప్పటివరకు 835 ఓటర్లు ఉన్నారని తెలిపారు. హెచ్‌ఎం వనజాకుమారి ఉన్నారు.

ముగిసిన ఉరుసు



కిస్తీ వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో మూడు రోజులుగా జరిగిన ఇమాం ఖాశీం స్వామి ఉరుసు బుధవారం కిస్తీ వేడుకలతో ముగిసింది. దర్గాలో స్వామి సమాధికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కులమతాలకు అతీతంగా ఆశేష జనవాహిని మధ్య కిస్తీ వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయం ప్రకారం ఎద్దుల బండిపై నైవేద్యం తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సచివాలయాల తనిఖీ



చిప్పగిరి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్ రాజు

చిప్పగిరి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీడీఓ సుధాకర్ రాజు సూచించారు. ఆయన బుధవారం చిప్పగిరి, దౌల్తాపురం సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

గోనెగండ్ల: స్థానిక దుర్గా భవానీ భారత్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ పి.తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లకు చెందిన భారతి, సుంకన్న, గంజిహళ్లికి చెందిన రామాంజినేయులు, శ్రీనివాసులు కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి స్థానిక భారత్ గ్యాస్ గోడౌన్ సమీపంలో విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఉదయం సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 118 కర్ణాటక మద్యం (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పాఠశాల పక్కనే మురుగు



మురుగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక వడ్డె వీధిలోని డీపీఈపీ పాఠశాల పక్కనే మురుగు కాల్వ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మురుగు నీరు అంతా అక్కడికి చేరి దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు, కాలనీవాసులు వాపోతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఎమ్మిగనూరురూరల్: కలుగొట్ల గ్రామంలో అర్హులైన దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం ఆమ్రేష్, తాలుకా ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ జయన్నకు వినతి పత్రం అందచేశారు. గ్రామంలో 150 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయని, అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు.

టీబీ డ్యాం సమాచారం



పూర్తిమట్టం	: 1633 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	: 1608.23
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం నిల్వ	: 34.221
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,227

భజన పోటీల విజేత కొత్తపల్లి

ఆస్పరి: మండలంలోని బిణిగేరిలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా కొత్తపల్లి భజన జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్లుకు బుధవారం బహుమతులు అందజేశారు. రెండవ బహుమతి నందవరం మండలం హెచ్ కైరవాడి, ఓంటెడుదిన్నె, మూడో బహుమతి విరుపాపురం, హలిగేర గెలుచుకున్నాయి. తరువాతి స్థానాల్లో తురువగల్లు సీతారమ జట్టు, అల్లీనగరం, గోసాని పల్లె, పుప్పాలదొడ్డి, ముకెళ్ల, తురువగల్లు, కప్పట్రాళ్ల భజన జట్లు గెలుపొందాయి. భజన జట్లకు వరుసగా రూ.15 వేలు, రూ. 12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులను ఆలయ నిర్వాహకుడు శ్రీనివాసులు స్వామి అందజేశారు.

ముగిసిన ఉత్సవాలు



శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి సమీపంలో శ్రీగిరి క్షేత్రంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి ఉత్సవాలు బుధవారం గిరి ప్రదక్షిణతో ముగిసాయి. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, బిళ్వార్చన, మహా మంగళహారతులు, నందికోలు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి భక్తులు శివనామస్మరణతో శ్రీగిరి ప్రదక్షిణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అత్యాశతో గంజాయి సాగు

- నిందితుడి అరెస్ట్



పొలంలో విచారణ చేస్తున్న రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ అధికారులు

కృష్ణగిరి: అత్యాశతో ఓ రైతు గంజాయి మొక్కలు సాగుచేసిన ఉదంతం కృష్ణగిరి మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు చాకచక్యంతో పసిగట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్దుర్తి సీఐ యుగంధర్ వివరాలు వెల్లడించారు. నిందితుడు మిద్దె పెద్దలాలు అదే గ్రామానికి చెందిన బంగి తాగే అలవాటు ఉన్న వ్యక్తి నుంచి గంజాయి విత్తనాలు సేకరించాడు. ఆ వ్యక్తి ఏడాది కిందటే చనిపోయినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం పెద్దలాలు సర్వే నంబర్ 734–2లో తనకు సొంతమైన 80 సెంట్లలో మిరప సాగుచేసి అంతర పంటగా గంజాయి విత్తనాలు చల్లాడు. ఇటీవల కర్నూలుకు చెందిన ఓ వ్యక్తికి రెండుసార్లు నాలుగు గంజాయి మొక్కలను రూ.9 వేలకు అమ్మినట్లు విచారణలో తేలింది. పొలంలో మొత్తం 83 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్టు (1985) కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

నిందితుడిని గుర్తించారిలా..

మిద్దె పెద్దలాలు కొద్ది రోజుల క్రితం డోన్ రైల్వేస్టేషన్ వద్ద ఓ వ్యక్తి గంజాయి తాగడం గుర్తించాడు. ఆ వ్యక్తితో తన వద్ద గంజాయి మొక్కలు ఉన్నాయని తక్కువ రేటుకు ఇస్తానని చెప్పాడు. ఆ వ్యక్తి పొలానికి వచ్చి రెండు సార్లు మొక్కలు కొనుగోలు చేశాడు. ఈ వ్యక్తి గంజాయికి అలవాటుపడినట్లు కర్నూలులో గుర్తించిన పోలీసులు అతని ద్వారా పెనుమాడ గ్రామంలో గంజాయి సాగు చేసిన విషయం తెలుసుకున్నారు. బుధవారం కోడుమూరు సెబ్ సీఐ శ్యాంప్రసాద్, కృష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పురుషోత్తం, ఏఓ వెంకటేశ్వర్లు మూకుమ్మడిగా దాడి చేసి పొలంలోని మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

దూరవిద్యకు అవకాశం

గోనెగండ్ల: పదవ తరగతి పూర్తి చేసి ఇంటర్ దూరవిద్య (డిస్టెన్స్)లో చేరాలనుకునే వారికీ ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దూరవిద్యలో ప్రవేశం పొంది పరీక్షలు రాయని అభ్యర్థులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. దూరవిద్యలో అడ్మిషన్ పొందిన విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన వారు కూడా పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలు రాయవచ్చునని తెలిపారు. ఈనెల 27వ తేదీ లోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు స్థానిక జూనియర్ కళాశాలను సంప్రదించాలన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం చేకూరుతోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించి వారికి పెద్ద పీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అంబేడ్కర్ భావజాలంతో దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎంగా వైఎస్ జగన్ నిలిచారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత 34 ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్‌ఆర్‌సీపీ గెలిపించుకోగలిగితే వాటిలో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం 18 మంది ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీలకు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్‌బోన్ అని వైఎస్‌ఆర్‌సీపీతో నిరూపణ అయ్యిందన్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా నియామకమైన 14 మంది జెడ్పీచైర్మన్లలో 9 మంది వెనుకబడిన, బడుగుబలహీన వర్గాల వారే ఉన్నారని, అదేవిధంగా నగర మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల నియామకంలోను 86 శాతం మందిని ఆయా వర్గాల వారినే నియమించినట్లు గుర్తు చేశారు. అన్ని కులాలు, అన్ని వృత్తుల వారికి ఆర్థికంగా ఏటా భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం



ఎమ్మెల్సీ ఎన్నికలపై వెల్దుర్తి మండల నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: వచ్చే నెలలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం ఆమె స్థానిక జ్యోతిబాపూలే, శ్రీవిద్యానికేతన్ డిగ్రీ కాలేజీలలో ప్రచారం నిర్వహించారు. కాలేజీ లెక్చరర్లతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా నిరుద్యోగులకు లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తోందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సైతం న్యాయం జరుగుతుందన్న భరోసా ఇచ్చారు. పట్టభద్రులు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను గమనించి రానున్న ఎన్నికల్లో తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక అమేజాన్ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గ్రామాల వారీగా నాయకులకు బాధ్యతలు అప్పగించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, నాయకులు సమీర్‌కుమార్ రెడ్డి, సుంకన్న, ముత్యాల శైలజ, మాధవస్వామి, బొమ్మన పెద్దిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యత, రాజకీయ, ఆర్థికాభివృద్ధికి అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమౌతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో మొత్తం 18 స్థానాలకుగాను 14 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడం విప్లవాత్మకమన్నారు.

ఘనంగా దేవర



కడిమెట్లలో కుంభాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల, రాళ్లదొడ్డి, కె.తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం మారెమ్మ, సుంకులమ్మ, లక్ష్మమ్మ అవ్వ దేవర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఆయా గ్రామాల్లో అర్ధరాత్రి మారెమ్మవ్వకు దున్నపోతులను బలి ఇచ్చారు. బుధవారం ఉదయం నుంచే పూర్ణకుంభాలతో దేవాలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఇళ్లన్నీ బంధువులతో కళకళలాడాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్త్ నిర్వహించారు.

తుగ్గలి: మండల పరిధిలోని మారెళ్ల, పి.కొత్తూరులో సుంకులమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, సుగాలి నాగమ్మ దేవతల దేవర ఉత్సవాలను బుధవారం ఆయా గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాం బాబు, సర్పంచ్ సుగునాథమ్మ, పోచిమిరెడ్డి మురళీధ రెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజినేయులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తోటలో చెలరేగిన మంటలు

వెల్దుర్తి: స్థానిక హైవే–44 కర్నూలు క్రాస్ వద్ద నిర్మాణంలోని భారీ ఆంజనేయ స్వామి విగ్రహం పక్కన గల కంపచెట్లలో బుధవారం నిప్పు రాజుకుంది. మంటలు రేగాయి. గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుధీర్, మహేశ్, విగ్రహ నిర్మాణకర్త రామాంజనేయులు మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు.ఈ లోపు పక్కనే ఉన్న సపోట తోటలోకి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న డోన్ ఫైర్ ఆఫీసర్ రంగస్వామి గౌడ్ తన సిబ్బందితో వచ్చి ఫైరింజన్ ద్వారా మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఆస్తి నష్టం జరగకుండా నివారించారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



మృతి చెందిన రాజశేఖర్

ఆలూరు రూరల్: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి కాపురానికి రాలేదని రాజశేఖర్ (25) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆలూరు మండలం కురుకుందకు చెందిన కనకప్ప, జయమ్మ దంపతుల కుమారుడైన రాజశేఖర్‌కు రెండేళ్ల క్రితం పెద్దకడుబూరు మండలం దొడ్డిమేకల గ్రామానికి చెందిన నాగేశ్వరితో వివాహం జరిగింది. కుటుంబ కలహాల కారణంగా భార్య రెండు నెలలుగా తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. కాపురానికి రావాలని పిలిచినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాజశేఖర్ బుధవారం ఉదయం పొలంలో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నాయక్ తెలిపారు.

నీటి ఎద్దడి నివారించండి



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

ఎమ్మిగనూరురూరల్: వేసవి ప్రారంభం కానుండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. బోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన సర్వేను త్వరగా పూర్తి చేయాలని, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి నెలా పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతుందా అని పరిశీలించాలన్నారు, ఈఓఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుడి హఠాన్మరణం



సిద్దబసప్ప (ఫైల్)

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు లింగాయత్ సిద్దబసప్ప (56) బుధవారం హఠన్మరణం చెందారు. సదరు వ్యక్తి తెల్లవారుజామున ఇంటి ముందు ఉండగా విపరీతమైన దగ్గు మొదలై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య చాముండి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వీరశైవ సంఘం కమిటీ ఎన్నిక

పత్తికొండ రూరల్: స్థానిక వీరభద్ర స్వామి దేవాలయంలో వీరశైవ సంఘం మండల కమిటీని బుధవారం సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా దండి మల్లికార్జున, హోటల్ మల్లికార్జున స్వామి, అధ్యక్షుడిగా గాజుల శేఖర్, ఉపాధ్యక్షుడిగా జి.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా జె.మంజునాథ్, ఇతర కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

డిగ్రీ కళాశాలలో వెబ్‌నార్

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ వెబ్‌నార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో అధ్యాపకులు వెబ్‌నార్ బ్రోచర్లను విడుదల చేశారు. క్యాన్సర్ గుర్తింపులో బయో ఇన్‌ఫర్మాటిక్స్ పాత్ర అనే అంశంపై నిర్వహించిన వెబ్‌నార్‌లో ప్రొఫెసర్లు డాక్టర్ కె.వెంకటేశ్వర స్వామి, డాక్టర్ కస్తూరి ప్రసంగించారు.

అమ్మవారి విగ్రహాల ఊరేగింపు

ఆస్పరి: ఆస్పరిలో ఈనెల 24వ తేదీన పెద్దమ్మవ్వ, దేవమ్మవ్వ విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలను బుధవారం భక్తులు మేళతాళాలతో ఊరేగించారు. బుధవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, వినాయక పూజ, కలశ స్థాపన గురువారం వినాయక పూజ, పంచామృతాభిషేకం, ధ్యానవాసం, జలవాసం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు.

మెనూ తప్పనిసరి

గోనెగండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఈఓ వినోద్ కుమార్ సూచించారు. బుధవారం కులుమాల జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు.

నేటి నుంచి ఓబులేసు స్వామి ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో వెలసిన ఓబులేసు స్వామి, భూదేవి, చెంచులక్ష్మి ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. గురువారం ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, అభిషేకం, పల్లకీసేవ, శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం, పల్లకీ, నందికోలు సేవ, శనివారం స్వామి వారి ప్రభోత్సవం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

25 నుంచి బడేసాహెబ్ స్వామి ఉరుసు



దర్గా ముఖద్వారం

గోనెగండ్ల: భక్తుల పాలిట కొంగు బంగారమైన గంజిహళ్లి మహాత్మ బడేసాహెబ్ స్వామి వారి దర్గా దివ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. కొన్ని వందల సంవత్సరాలుగా కులమతాలకు అతీతంగా భక్తులు దర్గాలో పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఏటా గ్రామంలో నిర్వహించే ఉరుసు మహోత్సవాలు ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 25న శనివారం స్వామివారి గంధం, 26న ఆదివారం ఉరుసు మహోత్సవం, 27న సోమవారం జియారత్ కార్యక్రమాలు జరుగుతాయి. పుట్టుకతోనే దైవాంశ సంభూతుడైన బడేసాహెబ్ స్వామివారు చిన్న వయస్సు నుండే నమ్మశక్యం కాని మహిమలు చూపేవారని భక్తులు పేర్కొంటారు. దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలతోపాటు అనుకున్నవన్నీ జరుగుతాయని విశ్వసిస్తారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దర్గా కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల నుంచి దర్గాకు చేరుకునేందుకు ఆర్టీసీ డిపో వారు అధిక సంఖ్యలో బస్సులను నడుపనున్నారు.